

ఆహ్లాదం సరే.. ఆదమరిస్తే..





రంగనాయక సాగర్ సందర్శనకు వచ్చిన పర్యాటకులు డ్యామ్ లోపలికి ప్రమాదకర ప్రాంతానికి వెళ్లి ఫొటోలు దిగుతున్నారు. కొందరైతే నీళ్లల్లో ఈత కొడుతున్నారు. కాస్త అయినా పట్టు తప్పిన భారీ మూల్యం చెల్లించక తప్పదు. గతంలో కూడా డ్యామ్ సందర్శనకు వచ్చిన కొందరు ఇలాగే ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

సాగుకు నీరివ్వండి

- రిజర్వాయర్లలోకి నీటిని వదలాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ లేఖ


సిద్దిపేట టౌన్, ఆగస్టు 3: సాగునీరు లేక సిద్దిపేట జిల్లాలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. జిల్లాలోని రిజర్వాయర్‌లోకి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. జిల్లాలోని అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు పూర్తిగా నీళ్ల లేక అడుగంటిపోయే పరిస్థితికి చేరుకున్నాయని లేఖలో పేర్కొన్నారు. గత సంవత్సరం ఇదే ఆగస్టు నెలలో అనంతగిరి రిజర్వాయర్‌లో 3.32 టీఎంసీల నీరు ఉంటే ప్రస్తుతం 0.75 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 2.38 టీఎంసీలకు ప్రస్తుతం 0.67 టీఎంసీలు, మల్లన్నసాగర్ 18 టీఎంసీలకు ప్రస్తుతం 8.5 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్ 10 టీఎంసీలకు ప్రస్తుతం 4.5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీరు లేక, మరోవైపు వర్షాలు కురవక పంటలు వేయాలా వద్దా అనే అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం కూడ తగ్గిపోయిందని వివరించారు. రాజకీయాలు పక్కనబెట్టి మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం పక్షాన కోరుతున్నట్లు పేర్కొన్నారు.


హరీశ్‌రావు రాసిన లేఖ


హరీశ్‌రావు

'మల్లన్నసాగర్'కు దిక్కెవరు?

- భూనిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరం
- సమస్యలను పట్టించుకునే నాథుడు కరువు
- ఎన్నికల ప్రచారం వేళ హామీల వర్షం
- అసెంబ్లీ, కేబినెట్‌లో సమావేశాల్లో ప్రస్తావనేది?




గజ్వేల్, ఆగస్టు 3 : మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూనిర్వాసితుల గోసను పట్టించుకునే వారు కరువయ్యారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లే వారే లేకపోవడంతో సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. ఉపాధి మార్గం లేక నిర్వాసితులు కూలీ పనులకు వెళ్లాల్సి వస్తున్నది. యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ప్యాకేజీ, పరిహారం, ఫ్లాట్లు రాని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగివేసారి పోతున్నారు. వీరి సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించే నాథుడే లేకపోవడంతో భూనిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ప్యాకేజీ, పరిహారం కోసం ఎదురుచూపులు

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లను కోల్పోయిన అనేక మందికి ఇంకా ప్యాకేజీ, పరిహారం అందక ఎదురుచూపులు తప్పడం లేదు. మూడేళ్ల క్రితం గజ్వేల్‌కు కట్టుబట్టలతో వచ్చిన భూనిర్వాసితులకు రావాల్సిన అనేక పరిహారాలు, ఫ్లాట్లు ఇప్పటికీ దక్కకపోవడంతో కాగితాలు పట్టుకుని తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒంటరి మహిళలు, 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులకు సంబంధించిన పరిహారాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటన్నింటిపై అధికారులు పలుమార్లు సమీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో వారు సైతం ఏమీ చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి లేదా ఇతర మంత్రులు ఈ విషయమై ఇప్పటివరకు సమీక్ష చేయకపోవడం గమనార్హం.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిరాశే

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల అంశం, నిధుల కేటాయింపు విషయమై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కొలిక్కి వస్తుందని భావించగా నిర్వాసితులకు నిరాశే ఎదురైంది. వారి సమస్యలు తెలిసిన జిల్లా మంత్రి కొండా సురేఖ, ఇతర మంత్రులు ఈ అంశంపై అటు అసెంబ్లీలో ఇటు కేబినెట్ సమావేశంలో ప్రస్తావించకపోవడం, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో పరిష్కారం కావడం లేదు. రూ.100 కోట్లు కేటాయిస్తే పరిహారం, ఇతరత్రా మౌలిక సదుపాయాలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని, కానీ ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపడం లేదని ఇటీవల ఓ అధికారి బాహాటంగానే తెలిపారు. భూనిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే తమకు ఇబ్బందిగానే ఉందని పేర్కొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ


ఎన్నికలొస్తేనే గుర్తుకొస్తారు

ఎన్నికలు వస్తేనే మల్లన్నసాగర్ భూనిర్వాసితులు పార్టీల నేతలకు గుర్తుస్తారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో నాయకులు మల్లన్నసాగర్ భూనిర్వాసితల సమస్యలను గూర్చి ప్రస్తావించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మంత్రులు, సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి మెదక్, సిద్దిపేట ఎన్నికల బహిరంగసభలలో వ్యాఖ్యానించారు. కానీ ఎన్నికలు ముగిశాక ముఖం చాటేశారు. సమస్యలపై అవగాహన ఉన్న మంత్రులు మాట్లాడలేదని, స్థానిక నాయకులు వారి ప్రాబల్యాన్ని పెంచుకోవడం మినహాయించి తమ సమస్యలను గూర్చి ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లే దిశగా ఆలోచన చేయడం లేదని భూనిర్వాసితులు వాపోతున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, ఫ్లాట్లు, పరిహారం, మౌలిక సదుపాయాలు, ఇతరత్రా వాటిపై సమీక్ష నిర్వహించాలని, ఉపాధి మార్గాలను చూపించాలని భూనిర్వాసితులు కోరుతున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3 : విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తరచుగా గ్రామాలను సందర్శించాలని, సమాచార వ్యవస్థను బలపరుచుకోవాలన్నారు. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పలు విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేసి సమూలంగా నిర్మూలించాలన్నారు. నిజాయితీగా విధులు నిర్వహించాలని, ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తుదారుడితో తప్పకుండా సంబంధిత ఇన్‌స్పెక్టర్ మాట్లాడాలన్నారు. ప్రతీ కేసును పారదర్శకంగా విచారించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని, అధికారులు, సిబ్బంది టెస్టులను చేయించుకోవాలని తెలిపారు. ఆమె వెంట సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్‌ఐలు కొమురయ్య, చంద్రయ్య, ఐటీ సెల్ ఎస్‌ఐ నరేందర్, ఏఎస్‌ఐలు శ్రీనివాస్, ముజీబ్, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.


త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ అనురాధ

వరద కాలువ కోసం భూమి పోతుందని
ఆగిన రైతు గుండె

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 3 : వరద కాలువ కోసం భూమి పోతుందని మదనపడుతూ ఓ రైతు పొలంలోనే గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందిన సంఘటన శనివారం హుస్నాబాద్‌లో చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన రైతు తిప్పట్ల మొండయ్య(58) శనివారం తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా గుండెపోటుతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మొండయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మొండయ్యకు 27 గుంటల వ్యవసాయ పొలం ఉంది. తన పొలం నుంచే వరద కాలువ కోసం గతంలో సర్వే నిర్వహించారు. తనకున్న భూమి పోతుందని రెండు రోజులుగా మదనపడుతున్నాడని స్థానికులు తెలిపారు. మొండయ్యకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుద్దాల చంద్రయ్య, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.


మొండయ్య(ఫైల్)

కాలకుంటకాలనీలో కార్డన్ సెర్చ్

- 25 బైకులు, 2 ఆటోలు ఒక టాక్టర్ సీజ్

సిద్దిపేట క్రైం, ఆగస్ట్ 3 : సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలకుంట కాలనీలో శనివారం సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. నార్కోటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ ప్రజల రక్షణ గురించి, భద్రత కల్పించడం కోసం తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో, గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు షెల్టర్ తీసుకుంటున్నారా తెలుసుకోవడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా గ్రామాల రక్షణ కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యాపారులు, వివిధ కుల సంఘాల పెద్దలు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు సీసీ కెమెరాల ఏర్పాటును చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 25 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. వాటికి సంబంధించిన పేపర్లు చూపించి తీసుకొని వెళ్లవచ్చన్నారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, దుబ్బాక సీఐ శ్రీనివాస్, వన్‌టౌన్ ఎస్‌ఐ నర్సింహారావు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సీజ్ చేసిన వాహనాలు

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాల్లోని లాడ్జీల్లో పోలీసు అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాగ్‌బుక్కును పరిశీలించారు. ఎవరెవరు వచ్చారు.. ఎప్పుడు.. ఎక్కడి నుంచి వచ్చారు వివరాలను ఆరా తీశారు. వన్ టౌన్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీబాబు, ఉపేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ లాడ్జీల్లో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. లాక్‌బుక్కులో రాసిన వివరాలను ప్రతీరోజు పోలీస్‌స్టేషన్‌కు పంపించాలని ఆదేశించారు. లాడ్జీకి వచ్చే అందరి దగ్గర ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. పేకాట, జూదం, వ్యభిచారం తదితర కార్యక్రమాలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు.

లాగ్‌బుక్‌లను ప్రతీరోజు పీఎస్‌కు పంపించాలి

గజ్వేల్, ఆగస్టు 3: లాడ్జీల్లోని లాగ్‌బుక్‌లను ప్రతీ రోజు పోలీస్‌స్టేషన్‌కు పంపించాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని లాడ్జీలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ యాదగిరిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తల్లిపాలు అమృతం



తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలుపుతూ సురభి వైద్య కళాశాల అధ్వర్యంలో సిద్దిపేటలోని బీజేఆర్ సర్కిల్ నుంచి పాత బస్టాండ్ వరకు శనివారం ర్యాలీని నిర్వహించారు.

- సిద్దిపే అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి)

అథ్లెటిక్స్ ఎంపిక



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకట స్వామిగౌడ్ తదితరులు పాల్గొని ఎంపిక పోటీలను పర్యవేక్షించారు.

- సిద్దిపేట క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి)

వరద వస్తే అంతే సంగతి!

లో-లెవల్ కల్వర్టులతో పొంచి ఉన్న ప్రమాదం.. ఏటా భయానక పరిస్థితి

- కడవేరుగు, వేచరేణి కల్వర్టుల నిర్మాణానికి నిధుల మంజూరైనా పనుల్లో జాప్యం
- ప్రతీ ఏడాది చేర్యాల-దానంపల్లి, చుంచనకోట-యాదాద్రి రోడ్లు జలదిగ్బంధం

చేర్యాల, ఆగస్టు 3 : వర్షాకాలం నేపథ్యంలో చేర్యాల మండలంలోని కడవేరుగు-నాగపురి, చేర్యాల-దానంపల్లి, చుంచనకోట-యాదాద్రి, చేర్యాల-వేచరేణి దారుల్లో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గాల్లో లో-లెవల్ కల్వర్టులపై వంతెనలను నిర్మించకపోవడంతో ఏటా వర్షాకాలంలో వరద ప్రవాహం రోడ్డుపైనుంచి ప్రవహిస్తూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్ల తరబడిగా కల్వర్టుల నిర్మాణంలో పురోగతి కానరాక అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నానాతంటాలు పడాల్సిన దుస్థితి నెలకొంటుంది.

ప్రారంభం కాని కడవేరుగు కల్వర్టు పనులు

చేర్యాల నుంచి కడవేరు గ్రామం మీదుగా నాగపురి, షబాషీగూడెం నుంచి కొండపోచమ్మ మీదుగా తక్కువ దూరంలో హైదరాబాద్‌కు వెళుతున్నారు. కానీ గ్రామంలోని చెరువు మత్తడి పారినా, వర్షాకాలంలో వరదవచ్చినా గ్రామశివారులోని మూలమలుపు కల్వర్టువద్ద రోడ్డుపైనుంచి ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొన్నాళ్ల క్రితం వరదనీటి ప్రవాహంతో రోడ్డంతా కోతకు గురవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండేళ్లక్రితం కల్వర్టు దెబ్బతినడంతో తాత్కాలికంగా పునరుద్ధరించినా తిరిగి యథాస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణం కోసం గతేడాది రూ.2.76కోట్లు నిధులు మంజూరవడంతో అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరైనా ప్రారంభించని పనుల నిధులను నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కల్వర్టు నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఎవరు చనిపోయినా తిప్పలే

వానాకాలంలో వేచరేణి గ్రామంలో ఎవరూ చనిపోయినా వాగులో ఉధృతంగా ప్రవహించే నీటిలో నుంచే శవాన్ని తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా నీటిలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఆందోళనలు చేపట్టాం. పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుని ఇక్కట్లు తీర్చాలి.

- టి.బాలరాజు, వేచరేణి


వేచరేణి వాగులో నీటిలో నుంచే శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకువెళుతున్న స్థానికులు(ఫైల్)

వేచరేణి బ్రిడ్జి నిర్మాణానికి అదే గతి!

మండలంలోని వేచరేణి శివారులోని వాగుపై చాలా ఏళ్ల చెక్‌డ్యాంను నిర్మించారు. దీంతో నీరు నిల్వ ఉండి భూగర్భజలాల నీటిమట్టం పెంపొందడంతో రైతులు పంటలు పండించుకుంటున్నారు. ఈ దారిగుండా చేర్యాల-కొమురవెల్లి మీదుగా హైదరాబాద్‌కు ప్రయాణిస్తుంటారు. వాగు అవతలి ఒడ్డున శ్మశానవాటిక ఉండటంతో గ్రామంలో ఎవరు చనిపోయినా వాగుగుండా వెళుతూ అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.1.95 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ఖరారైనా కాంట్రాక్టర్ పనులు చేపట్టడకపోవడంతో కార్యరూపం దాల్చక గ్రామస్థుల పాలిట శాపంగా మారింది.

తాడూరు వాగు తంటాలు


చేర్యాల నుంచి తాడూరు గ్రామం మీదుగా కొండపాక, నంగునూరు, హుస్నాబాద్ మండలాల్లోని పలు గ్రామాలకు అతితక్కువ దూరంతో ప్రయాణిస్తున్నారు. కానీ గ్రామ శివారులోని వాగులో నుంచి ప్రయాణం చేస్తున్న క్రమంలో వర్షం కురిసిన ప్రతీసారి వరద నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతుంది. దీంతో ఇరు మార్గాలకు రాకపోకలు నిలిచిపోతుండటంతో నానాతంటాలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో హై-లెవల్ వంతెన నిర్మిస్తామని నాయకులు హామీలు గుప్పిస్తున్నా ఆ తరువాత ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

చుంచనకోట-యాదాద్రి దారిలో

చేర్యాల నుంచి బచ్చన్నపేట, ఆలేరు మీదుగా యాదాద్రికి ప్రధాన మార్గం ఉంది. కానీ తక్కువ దూరంలో చుంచనకోట మీదుగా బచ్చన్నపేట, యాదాద్రి జిల్లా రాజపేట మండలం మీదుగా యాదాద్రికి ప్రయాణిస్తున్నారు. చుంచనకోట శివారులో లో-లెవల్ వంతెనపైనుంచి వరదనీరు రోజుల తరబడి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.


కడవేరుగు శివారులో వరద నీటిని దాటుతున్న గ్రామస్థులు


ప్రమాదకరంగా ప్రవహిస్తున్న తాడూరు వాగు


వేచరేణి శివారులో దెబ్బతిన్న దారి

(ఫైల్‌ఫొటోలు)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేర్యాల, ఆగస్టు 3: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాలకు చెందిన పుల్లం వెంకటనర్సయ్య(68) శుక్రవారం అర్ధరాత్రి ఇంటి నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై హోటల్‌కు వెళ్తున్నాడు. బస్టాండ్ సమీపంలో జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి దాటుతుండగా సిద్దిపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన వెంకటనర్సయ్యను స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజుగౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంలో అక్రమంగా పశువుల తరలింపు

గుమ్మడిదల, ఆగస్టు 3: డీసీఎంలో పశువులను అక్రమంగా తరలిస్తుండడంతో నల్లవల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పశువులను అక్రమంగా డీసీఎంలో నిర్బంధించి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పశువుల తరలింపుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వెంటనే గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహ్మద్ రహీంతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామస్థుల కోరిక మేరకు పశువులను గోశాలకు తరలించినట్లు చెప్పారు.


డీసీఎంలో ఉన్న పశువులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

చేర్యాల, ఆగస్టు 6: కుటుంబ కలహాలతో వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేర్యాల మండలం చిట్యాలకు చెందిన మ్యాక సత్తయ్య(37) రైతు. కుటుంబ అవసరాల కోసం కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసగా మారాడు. అప్పులు ఎలా తీరుతాయని భార్యాభర్తల మధ్య రెండురోజుల క్రితం తగాదా జరిగింది. భార్య కృష్ణవేణి పనులకు వెళ్లగా, సత్తయ్య తండ్రి ఐలయ్య ఇంటి వద్ద ఉన్నారు. కొద్దిసేపటికి సత్తయ్య పురుగుల మందు తాగగా.. తండ్రి గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. వారు 108 అంబులెన్స్‌లో చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.


మర్పడగ విజయ దుర్గామాత ఆలయం


కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గలఅష్టాదశ శక్తిపీఠ ఆలయం


సిద్దిపేట వేంకటేశ్వర ఆలయం

శోభాయమానం.. శ్రావణమాసం

- సకల సౌభాగ్యలందించే శ్రావణం రేపటి నుంచే ప్రారంభం
- నెలపాటు ఆధ్యాత్మిక వాతావరణం
- పూజలు, పునస్కారాలు, వ్రతాలకు ఈ నెల పెట్టిందిపేరు
- కిటకిటలాడనున్న ఆలయాలు

కొండపాక, ఆగస్టు 3: సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు మనది. తెలుగు నెలల్లో ప్రతినెలా ఏదో ఒక ప్రత్యేకతను చెబుతుంది. అలాంటి దాంట్లో శ్రావణ మాసం ఒకటి. ఈ మాసంలో పండుగలతో పాటు ఆలయాలు నెలరోజుల పాటు భగవన్నామస్మరణతో మారు మోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందంటున్నారు పండితులు. అంత గొప్ప పవిత్రమాసం సోమవారంతో ప్రారంభమవుతుంది. సనాతన ధర్మంలో చంద్రమానం ప్రకారం తెలుగు మాసాల్లో ఇది ఐదవది. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది. వివిధరకాల పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ప్రసాదించే మాసంగా పెద్దలు చెబుతారు. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.

సంస్కృతి సంప్రదాయాల మాసం

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో 'శ్రావణ మాసం' అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ మాసంలో ముఖ్యమైనవి పండుగలు వరలక్ష్మీవ్రతం, మంగళగౌరీ వ్రతం, రాఖీపౌర్ణమి.

శివారాధనకు ఎంతో విశిష్టత

శ్రావణమాసం దక్షిణాయనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తారు.

మంగళ గౌరీ వ్రతం

శ్రావణమాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ, మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. వివాహమైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభిస్తారు. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం చేస్తారు.

వరలక్ష్మి వ్రతం

శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేస్తారు. ఒకవేళ అప్పుడు వీలుకా


మర్పడగ విజయదుర్గా మాత

కుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరించవచ్చని పండితులు సూచిస్తున్నారు.

రాఖీ పౌర్ణమి

శ్రావణపౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈరోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షాబంధనం జరుపుతారు. అంతేకాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవిత్రధారణ చేస్తారు. ఇవే కాకుండా కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్రస్వామి ఆరాధన వంటి ముఖ్య రోజులు వచ్చేవి శ్రావణ మాసంలోనే. కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న ఈనెలలో చేయాల్సిన విధులు, పూజలు, వ్రతాలు, నియమాలు, తూచ తప్పకుండా ఆచరిస్తే సకల సౌభాగ్యాలు కలుతాయనే భావన.

గురుకులంలో తప్పెవరిది..!

- ఉపాధ్యాయురాలి కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- కలెక్టర్ ఆదేశాలతో ఎంఈవో విచారణ


విద్యార్థులు రోడ్డెక్కడానికి గల కారణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో దశరథ్

మునిపల్లి, ఆగస్టు 3: సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల కళాశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న రజినిరెడ్డి గతనెల 24న బదిలీపై వెళ్లింది. అయితే పాఠశాలకు తెలుగు టీచర్ రాలేదు. బదిలీ అయిన విషయం విద్యార్థులకు తెలియకపోవడంతో గతనెల 26న ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రిన్సిపాల్ సురభి చైతన్య వద్దకెళ్లి తెలుగు టీచర్ రజినిరెడ్డి కళాశాలకు ఎందుకు రావడం లేదు సార్ అంటూ అడిగారు. ఇందుకు ప్రిన్సిపాల్ నుంచి ఎలాంటి స్పందన రాలేకపోవడంతో చేసేదేమి లేక గతనెల 30న టీచర్‌ను తిరిగి రప్పించాలంటూ 165 ముంబయి జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి సీరియస్‌గా తీసుకుని గురువారం గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రోడ్డు పైకి వెళ్లి ధర్నా చేసేంతవరకు మీకు తెలియదా.. వారు బయటకు వెళ్తే.. మీరు ఏం చేస్తున్నారని ప్రిన్సిపాల్ చైతన్యతోపాటు సిబ్బందిని నిలదీశారు. దీంతో వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో విచారణ చేపట్టాలని ఎంఈవో దశరథ్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈవో దశరథ్ శనివారం కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మీరు ఎందుకు రోడ్డు పైకి వెళ్లి ధర్నా చేయాల్సి వచ్చింది. ఎవరైనా చేయండని ప్రేరేపించారా.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారో అడగాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ పీఈటీ, ఉపాధ్యాయులపై ఎంఈవో మండిపడ్డారు. విద్యార్థులు ధర్నా చేసిన రోజు ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోగా.. ఇన్‌చార్జి బాధ్యతలను ఎవరికీ అప్పగించకపోవడంతో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై విచారణ చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఎంఈవో తెలిపారు.



స్నేహం.. దేవుడిచ్చిన వరం

- కష్టసుఖాల్లో పాలుపంచుకునేది స్నేహితులే
- నేడు స్నేహితులు దినోత్సవం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 3: సృష్టిలో అమ్మ ప్రేమది మొదటి స్థానమైతే... స్నేహానిది రెండో స్థానమని చెప్పవచ్చు. స్నేహం అనేది ఇద్దరు పురుషులు, ఇద్దరు బాలికల మధ్య ఉండడమే స్నేహం కాదు. బాల, బాలికల మధ్య కూడా పవిత్రమైన స్నేహం ఉంటుంది. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరికీ స్నేహితులు ఉంటారు. సమాజంలో అమ్మ తరువాతి స్థానం స్నేహానిదే. అమ్మ తన బిడ్డల కోసం సర్వం త్యాగం చేస్తే స్నేహం తన మిత్రుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతారు. స్నేహం భగవంతుడు ప్రసాదించిన వరం. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్యజ్యోతి' అందిస్తున్న కథనం.

ఈ సృష్టిలో తోబుట్టువులు, బంధువులు లేనివారు ఉండవచ్చు కానీ స్నేహితులు లేని వారు మాత్రం ఉండరనేది జగమెరిగిన సత్యం. స్నేహితులు అనగానే మనకు ముందుగా గుర్తుకువచ్చేది మహాభారతంలోని కర్ణుడు. తన స్నేహితుడు దుర్యోధనుడి కోసం తన కుటుంబసభ్యులతో సైతం యుద్ధానికి పూనుకుంటాడు. కృష్ణుడు, కుచేలుడు, రామాయణంలో రాముడు, సుగ్రీవుడుల స్నేహం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. పురాణ గాథలు మహాభారతం నుంచి నేటివరకు స్నేహానికి ప్రాధాన్యత సంతరించుకుని ఉన్నది. స్నేహితులుగా ఉంటూ ఎందరో తమ మిత్రుల కోసం ప్రాణ త్యాగాలు చేసినట్టు చరిత్ర చెబుతున్నది. ఎవరైనా ఒకరితో స్నేహం చేసే ముందు కులం, మతం, ప్రాంతాలు అడగరు. నిజమైన మిత్రులకు ఆస్తి లేదనే చెప్పాలి. స్నేహానికి ఎల్లలు, సరిహద్దులు చేరిపేశక్తి ఉంటుంది. తల్లిదండ్రులు, అన్నదమ్ములతో పంచుకోలేనివి స్నేహితునితో పంచుకుంటారు. మంచి స్నేహం ప్రారంభదశ నుంచి మహావృక్షంలా ఎదుగుతుంది.

స్నేహితుల మధ్య దూరం పెంచిన స్మార్ట్‌ఫోన్లు

గతంలో కొత్త సంవత్సర వేడుకలు వచ్చాయంటే చాలు తమ స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ డిజైన్లలో గ్రీటింగ్ కార్డులను ఇచ్చేవారు. స్నేహితుల బ్యాండ్లు ఒకరికొకరు చేతులకు వేసుకుని శుభాకాంక్షలు చెప్పుకునేవారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని స్నేహితుల మధ్య దూరం పెరిగింది. గతంలో తమ ఇంటిలో పెళ్లిల్లు, బర్త్‌డే ఇతరత్రా శుభకార్యాలు జరిగితే ఎంత దూరమైనా వారి వద్దకు వెళ్లి పత్రికలు అందించి ఆహ్వానించేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడమే కాకుండా తమ ఇళ్లలో పెళ్లితో సహా బర్త్‌డేలు జరిగినా ఫోన్‌లో కార్డు పంపించడం ఆనవాయితీగా మారిపోయింది.

జీవితంలో ఓ భాగమైన స్నేహితులు



స్నేహితులు జీవితంలో ఓ భాగమై పయనం సాగుతుంది. కష్టసుఖాల్లో అంటిపెట్టుకుని ఉండే వాడే నిజమైన స్నేహితుడు. తనకు బాల్యమిత్రులు ఇప్పటికీ కలుస్తూ తనతో వారి కష్టాలు పంచుకుంటారు. తనకు ఎల్లప్పుడూ ధైర్యాన్నిచ్చే స్నేహితుడు శ్రీనివాస్. అతడితో కలిస్తే తనకు పోయిన ఊపిరి వచ్చినట్లవుతుంది.

- రాజు, ఇరిగ్గిపల్లి గ్రామం, సంగారెడ్డి మండలం

స్నేహితుడిని మరిచిపోవద్దు



ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకుని ఒడ్డున చేర్చేవాడే నిజమైన స్నేహితుడు. కష్టాలు వచ్చినప్పుడు అండగా నిలిచిన స్నేహితుని మరిచిపోవద్దు. స్నేహితుడిని ద్వేషించకు.. అతనిలోని గుణాలను ద్వేషించి మంచి మార్గంలో పెట్టగలిగేవారిదే నిజమైన స్నేహం. తనకు అధికంగా దగ్గరగా ఉండే స్నేహితుడు ఏపీవో వెంకట్. అతను కలిసిన ప్రతిసారి తమ బాగోగులు, కష్టసుఖాలు పంచుకుంటాం.

- ఏపీజీకే ప్రసాద్, ఏవో, సంగారెడ్డి ప్రత్యేకాధికారి

స్నేహితుడికి చేయూత

జగదేవ్‌పూర్, ఆగస్టు 3: జగదేవ్‌పూర్ మండలం మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్నేహితుడికి ఆర్థిక చేయూతనిచ్చారు. దొమ్మట బాలరాజు ఇటీవల అనారోగ్యంతో ఆర్‌వీఎం ఆస్పత్రిలో చేరాడు. ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. అనంతరం రూ.43 వేల ఆర్థిక సహాయం అందించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, సత్యనారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్


సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్/మెదక్/సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 3: ధరణి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించి, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సక్సేషన్ పెండింగ్, మ్యుటేషన్ లాంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో వసంతకుమారి, కలెక్టరేట్ ఏవో పరమేశం, మెదక్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు, సిద్దిపేట నుంచి కలెక్టర్ మనుచౌదరి, డీపీవో దేవకీదేవి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

- భవనం పైనుంచి పడి ఒకరు, రోడ్డు ప్రమాదంలో మరొకరు


శ్యాంబాబు మృతదేహం, తీవ్రంగా గాయపడిన బోస్

పుల్‌కల్, ఆగస్టు 3: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం వేర్వేరుగా జరిగిన ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పుల్‌కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం శివంపేటలో మతిస్థిమితం లేని వ్యక్తి కొంతకాలంగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రయాణికులు పోలీసులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ముద్దలుగా ఉన్న మృతదేహాన్ని పారతో ఎత్తుకుని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ...

భవనం పైనుంచి పడి ఓ తాపీమేస్త్రీ మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పొదిలి మండలానికి చెందిన వరికుంట్ల శ్యాంబాబు(35), కొమ్ము బోస్(30) మండల కేంద్రమైన చౌటకూర్‌లో పార్కుల రాంరెడ్డి ఇంటి నిర్మాణ పనులను జయరాం అనే మేస్త్రీ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. అతని వద్ద వీరు పనిచేస్తున్నారు. శనివారం ఉదయం రెండో అంతస్తు పైకి ఎక్కి గోడపై నిలబడి ప్లాస్టింగ్ పనులు చేపడుతున్నారు. అదుపుతప్పి కింద పడటంతో వరికుంట్ల శ్యాంబాబు తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇదే ఘటనలో కొమ్ము బోస్ కాలు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు.


అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, ఆగస్టు 3: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కొత్త బాబు(25) వాషింగ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా పనులు లేనందున కుటుంబం గడవడానికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక 1న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిర్గాపూర్ కేజీబీవీలో అధికారుల విచారణ

కల్హేర్, ఆగస్టు 3: మండల కేంద్రమైన సిర్గాపూర్ కేజీబీవీలో బోధన సిబ్బంది ఫిర్యాదుకు స్పందించిన సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు శనివారం విచారణ జరిపినట్లు తెలిసింది. కేజీబీవీ ప్రత్యేకాధికారి లలిత తోటి సిబ్బందితో అమర్యాదగా ప్రవర్తించడానికి తోడు తనకున్న అధికారాలను ఉపయోగించుకుని సిబ్బందిని నిత్యం ఇబ్బందులు, వేధింపులకు గురిచేస్తుంది. ఈ విషయమై సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంగారెడ్డి సర్వశిక్షా అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేన్ అధికారి(సీఎంవో) వెంకటేశ్, జీసీడీవో సుప్రియ, అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) అనురాధ శనివారం సిర్గాపూర్ కేజీబీవీని తనిఖీ చేసి సిబ్బందిని విడివిడిగా విచారించినట్లు తెలిసింది. ప్రత్యేకాధికారితో మీకేమైనా ఇబ్బందులు ఉంటే రాతపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వారు సిబ్బందికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చిన అంశాలను జిల్లా విద్యాధికారికి నివేదిక రూపంలో సమర్పించనున్నట్లు వారు బోధన సిబ్బందికి చెప్పినట్లు సమాచారం. ఇదిలాఉండగా చాలాఏళ్లుగా సిర్గాపూర్ కేజీబీవీ ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న లలితను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని స్థానికులు కూడా అధికారులకు విన్నవించారని తెలిసింది. ఈ విషయమై మండల విద్యాధికారి శంకర్‌ను వివరణ కోరగా సిర్గాపూర్ కేజీబీవీ బోధన సిబ్బంది ఫిర్యాదుపై జిల్లా అధికారులు విచారణకు వచ్చిన మాట వాస్తవమేనని, సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పర్యటన ఉన్నందున తనకు పూర్తి వివరాలు తెలియవని ఆయన సమాధానమిచ్చారు.

టీఎస్‌పీఎస్‌సీ ఫలితాల్లో నరేష్‌కు 461 ర్యాంక్


కటిక నరేష్

వర్గల్, ఆగస్టు 3: వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన కటిక నరేష్ శనివారం టీఎస్‌పీఎస్‌సీ వెల్లడించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఫలితాల్లో రాష్ట్రంలోని మల్టీజోన్ వన్ కేటగిరీలో 461 జనరల్ ర్యాంక్, బీసీ-డీ విభాగంలో... 450 మార్కులు సాధించి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. నరేష్ వర్గల్ మండలం, అంబర్‌పేటలో ప్రాథమిక, మినాజీపేటలో ఉన్నత విద్యాభ్యాసం చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ ఎమ్మెన్నార్ జూనియర్ కళాశాల (మియాపూర్). దూలపల్లి సెంట్ మార్టిన్‌లో ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ విద్యనభ్యసించాడు. నరేష్ ఎంపిక కావడం పట్ల కుటుంబసభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీ రఘునందన్‌రావు ఆరా

రామచంద్రాపురం, ఆగస్టు 3: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీ రఘునందన్‌రావు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ సంగారెడ్డితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా మైఫేర్ రోడ్డు ఎందుకు పూర్తికాలేదు. భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై విచారించారు. అలాగే టీ-5 జోన్‌లోని భూముల వివరాలను ఎంపీ సేకరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా ఉత్పత్తుల ప్రదర్శనను ఎంపీ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎస్.రాజు తదితరులతో కలిసి ఎంపీ ప్రారంభించారు.


మెప్మా ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్

‘స్వచ్ఛదనం, పచ్చదనం’ను జయప్రదం చేయాలి

● రేపటి నుంచి 9 వరకు నిర్వహణ
● ప్రత్యేకాధికారులు, ప్రభుత్వ అధికారులు

గజ్వేల్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం మునిసిపల్ అధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వివిధ పారిశుధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలు పెంపకం, చెట్ల కత్తిరింపులు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌సెక్ప్టర్ రవీందర్, టీపీవో శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

● **తొగుట:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేయాలని తొగుట మండల ప్రత్యేకాధికారి శ్రీరాంరెడ్డి సూచించారు. తొగుట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశావర్కర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వ్రత్యేకాధికారులు రాధాకిషన్, మోహన్, యాదవరెడ్డి, రామకృష్ణారెడ్డి, కిరణ్, శంకర్, అముతుల్, చందన, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

● **మద్దూరు:** ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రాధిక సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామ్మోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్రత్యేకాధికారి వరదా రెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ సెక్రెటరీలతో మండల పరిషత్ కార్యాలయంలో ఆయన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం నరసయ్య ఎంపీవో మంజుల పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** గ్రామ గ్రామాన జరిగే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



గజ్వేల్: మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ గొల్కొండ నరసయ్య


తొగుట: ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీరాంరెడ్డి

కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ ప్రత్యేకాధికారలు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన స్వచ్ఛదనం-పచ్చదనంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి వార్డులో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నలినిదేవి, రమాదేవి, స్వర్ణలత, చిత్తారి పద్మ, సరోజన, హరీశ్ ఉన్నారు.

● **ములుగు:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేకాధికారి రామచంద్రారావు సూచించారు. శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సింగన్నగూడ గ్రామపంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి సమీపంలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆశావర్కర్లు తదితరులున్నారు.


బెజ్జంకి: అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు


దుబ్బాక: మాట్లాడుతున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి


మద్దూరు: సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు

గద్దర్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేద్దాం

● గద్దర్ ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు


గద్దర్ సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 3: గద్దర్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేద్దామని గద్దర్ ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గద్దర్ సంస్మరణ సభ పోస్టర్‌ను మాల మహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, పీసీసీ రాష్ట్ర నాయకుడు గడ్డం శ్రీనివాస్‌తో కలసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. ఈ నెల 6న రవీంద్రభారతిలో నిర్వహించే ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట నాయకులు చిప్పల యాదగిరి, రాజు, మహ్మద్ ఉమర్, తుమ్మ యాదగిరి, పోతరాజు కనకస్వామి, గణేశ్ ఉన్నారు.

‘పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం’


సమావేశంలో మాట్లాడుతున్న గౌడ అసోసియేషన్ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3: ఈ నెల 18న జరిగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె బాలకిషన్‌గౌడ్ తెలిపారు. సిద్దిపేటలోని పాపన్నగౌడ్ చౌరస్తాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్, సిద్దిపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏళ్లుగా పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించమన్నారు. ఆగస్టు 18న జరిగే పాపన్న గౌడ్ జయంతికి సిద్దిపేట గౌడ సంఘ సభ్యులతో పాటు జిల్లా, నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల గౌడ కులస్థులతో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో స్థలాన్ని ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సులకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో పల్లె కనకయ్య గౌడ్, బాలగోని నర్సింహులుగౌడ్, బోల్లం శివలింగంగౌడ్, రామంచ మల్లేశంగౌడ్, గాదగోని శ్రీనివాస్‌గౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, పల్లె రామస్వామిగౌడ్, గొల్లపల్లి శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి సేవలు మరువలేనివి: అదనపు కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 3: జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిగా సరోజ ఎన్నో సేవలు చేశారని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ఆమె ఉద్యోగవిరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో ముందుకు తీసుకెళ్లి వారి సంక్షేమానికి సరోజ కృషి చేశారని తెలిపారు. ఆమె సేవలను ఎప్పటికీ జిల్లా ప్రజలు మర్చిపోరని చెప్పారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజా శర్మ మాట్లాడుతూ.. సరోజ అందించిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనంతరం సరోజ ప్రభాకర్ దంపతులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, బంధుమిత్రులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జగత్‌కుమార్‌రెడ్డి, డీపీవో దేవకీదేవి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీటీవో బల్ రాజు, జిల్లా వెల్ఫేర్ అధికారి , జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సీహెచ్. కవిత, సెట్విన్ జిల్లా అధికారి అమీనా తదితరులు పాల్గొన్నారు.


సమావేంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజా శర్మ

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు, ఆగస్టు 3: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొత్తూరులో శుక్రవారం రాత్రి పర్యటించి పత్రాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘క్రీడా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట’

ములుగు, ఆగస్టు 3: క్రీడా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నెల రోజులుగా నడుస్తున్న వాలీబాల్ పోటీల్లో నాలుగు టీంలు పాల్గొన్నాయి. శుక్రవారం రాత్రి ఫైనల్ మ్యాచ్ జరిగింది. గెలుపొందిన టీంకు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి రూ. 25 వేలు అందించగా, రెండో టీంకు మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ బహుమతులతో పాటు 20వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌పటేల్, అశోక్, ఆసిఫ్, కరుణాకర్‌రెడ్డి, భూచక్రం, కనకయ్య, నాగేష్, సత్యనారాయణగౌడ్, శ్రీరాములు, హనుమంతరెడ్డితో పాల్గొన్నారు.

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గోరిట సంబరాలు


గోరింటాకు చూపుతున్న విద్యార్థులు

రాయపోల్, ఆగస్టు 3: ఆషాఢమాసం వచ్చిందంటే చాలు అమ్మాయిలు చేతుల నిండా గోరింటాకు పెట్టుకుని సంబుర పడుతుంటారు. ఆషాఢమాసం ముగుస్తున్న సందర్భంలో శనివారం రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు రమాదేవి, వంశీకృష్ణ, స్రవంతి, మంజుల, శృతి పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా బోధించాలి

రాయపోల్, ఆగస్టు 3: ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ఉపయోగించుకుని బోధన ఉపకరణాలతో ప్రైవేటు బడులకు దీటుగా బోధించాలని ఏఎంవో(అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) భాస్కర్ సూచించారు. శనివారం రాయపోల్, బేగంపేట పాఠశాలను పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

చేర్యాల, ఆగస్టు 3: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. చేర్యాల పట్టణ శివారు బండపల్లి కాలనీకి చెందిన అనంతుల నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో కిరణ్‌కుమార్ స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.60వేలు మంజూరు చేయించి శనివారం ఆమెకు చెక్కును అందజేశారు. ఆయన వెంట తదిదరులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

మర్కుక్, ఆగస్టు 3: విద్యార్థులకు తరగతి గదిలో నేర్పిన అక్షరాలే వారి భవిష్యత్తుకు మార్గం చూపుతాయని, ఉపాధ్యాయులే వారి భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులని స్పందన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సాయిప్రసాద్, ప్రొఫెసర్ రమేష్‌లు అన్నారు. మండల పరిధిలోని చేబర్తి ప్రాథమిక పాఠశాలతో పాటు పాములపర్తి, అంగడికిష్టాపూర్, వర్గల్ మండలంలోని బొర్రగూడెం, చౌదర్‌పల్లి, అవుసులోన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5 తరగతి విద్యార్థులకు స్పందన చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ వారి సౌజన్యంతో ఇంగ్లిష్, తెలుగు రైటింగ్ బుక్స్ డ్రాయింగ్‌బుక్స్ అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వాహకులను సన్మానించారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహుకరణ

నంగునూరు, ఆగస్టు 3: నంగునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.44 వేల విలువచేసే సౌండ్ సిస్టంను శనివారం ప్రధానోపాధ్యాయుడు జి.రామస్వామిగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దాసరి పెంటయ్య, రాగిరి రాజ్‌కుమార్, తోట రాధాకృష్ణ, ఎస్.కృష్ణమాచారి, బొజ్జ చంద్రకాంత్, వి సంపత్, రవీందర్, సురేందర్, వి.మధుసూధన్, మోహన్‌బాబు, జి.బాలమణి, ఎస్.స్వాతి, జే.రమాదేవి, కవిత, రంజిత్, శ్రీనివాస్, మహిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలి

కొండపాక, ఆగస్టు 3: ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు అంబటి బాలచందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కొండపాకలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో దానం నాగేందర్ మాట్లాడిన తీరు సరైనది కాదన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫికెట్‌ను అందుకున్న శశిధర్‌శర్మ

వర్గల్, ఆగస్టు 3 : హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో ఈ నెల 1 నుంచి 3వ తేది శనివారం వరకు ఇంపాక్ట్ ఇంటర్నేషన్ ఆధ్వర్యంలో 30 మంది ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణలతో మెగా ఇంపాక్ట్ పేరుతో 2000 మంది విద్యార్థులకు ఇంపాక్ట్ వ్యవస్థాపకులు గంప నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ మెగా ఇంపాక్ట్ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు, వర్గల్ మండలం చౌదరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ బెస్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా ఇంపాక్ట్ సర్టిఫికేటును అందుకున్నాడు.

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు


బండి సంజయ్‌కి శాలువా కప్పుతున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 3: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో ఎంపీ కార్యాలయంలో శనివారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి వీరాచారి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని బండి సంజయ్ పేర్కొన్నాట్లు శంకర్‌బాబు తెలిపారు.

‘మైనంపల్లి’ని కలిసిన నాయకులు

కొండపాక, ఆగస్టు 3: కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని నాగులబండలో ఉన్న ఓ హోటల్ వద్ద మైనంపల్లిని జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నాయకులు రుషి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కలిశారు.

పట్టణాన్ని హరితమయం చేద్దాం

● మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి

చేర్యాల/హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 3: చేర్యాల పట్టణాన్ని హరితమయం చేసేందుకు చిత్తశుద్ధితో పాటుపడుతున్నామని, అందుకు ప్రజ ల భాగస్వామ్యం ఎంతో కీలకమని మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అన్నారు. వనమహోత్సవలో భాగంగా పట్టణంలోని 5, 6వ వార్డులలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, యాట కనకమ్మతో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ప్రభాకర్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ లోని ప్రతి వార్డులో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో వనమహోత్సవంలో బాగంగా 8వ వార్డులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్‌చైర్‌పర్సన్ అనితారెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆముదాల రంజిత్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 3: సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ బృందంతో కలసి శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 3: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 9 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని సిద్దిపేట కోర్టు లో హాజరుపరచగా విచారణ చేసి 9 మందికి రూ.4500 జరిమాన విధించారు.

జాబ్ క్యాలెండర్‌లో జాబ్‌లు లేవు.. తేదీలే ఉన్నాయి

● బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ రూమ్ క్యాలెండర్‌గా ఉందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేష్, జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పై శనివారం సిద్దిపేట గ్రంథాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్‌లో జాబులు లేవు తేదీలు మాత్రమే ఉన్నాయని, జాబ్‌లు లేని క్యాలెండర్ జాబు క్యాలెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ విధానం లోపా భూయిష్టంగా ఉందన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగకపోతే భవిష్యత్తులో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బిక్షపతి, పట్టణ అధ్యక్షుడు మహిపాల్, సమన్వయకర్త రమేష్, నాయకులు శ్రీకాంత్, అరవిందురెడ్డి, రాజు, సతీష్, కమల్, రాములు, సాయిచరణ్, గణేష్, వైకుంఠం, నవీన్, రమాకాంత్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట అర్బన్: గ్రంథాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

● **గజ్వేల్:** నిరుద్యోగులను ఏమార్చేందుకే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. గజ్వేల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చిన అనంతరం మోసం చేసే విధంగా ఉద్యోగాల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

కోర్టు భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థల పరిశీలన


స్థలపరిశీలన చేస్తున్న న్యాయాధికారులు

దుబ్బాక, ఆగస్టు3: దుబ్బాకలో ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుభవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం సిద్దిపేట జిల్లా న్యాయాధికారి సాయి రమాదేవి పరిశీలించారు. స్థానిక పాత ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నూతన కోర్టు భవనం నిర్మాణం కోసం స్థల కేటాయించారు. ఆ స్థలాన్ని దుబ్బాక ఫస్ట్ క్లాస్‌కోర్టు న్యాయాధికారి తరుణీతోపాటు పరిశీలించారు. కోర్టు భవనంతో పాటు న్యాయాధికారి నివాసభవనం(క్వార్టర్స్) నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ డీఈఈ వెంకటేష్‌కు న్యాయమూర్తి ఆదేశించారు. వారితో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు, కోర్టు సూపరింటెండెంట్ సుధాకర్, న్యాయవాదులు సంజీవరెడ్డి, కాస్తీ శ్రీనివాస్, నాగరాజ్, రామకృష్ణప్రభు తదితరులున్నారు.

‘జప్తి నాచారానికి బస్సును నడపాలి’

కొండపాక, ఆగస్టు 3: మండలంలోని జప్తినాచారంని బస్సు సౌకర్యం కల్పించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్ కోరారు. శనివారం సిద్దిపేట డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కొండపాక మండలంలో జప్తి నాచారం గ్రామంతో పాటు పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నాడు.

కడవేరుగులో కుక్కల బెడద

చేర్యాల, ఆగస్టు 3: చేర్యాల మండలం కడవేరుగులో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయమై సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో కుక్కల గుంపు

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్

కోహెడ, ఆగస్టు 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కలకొండ రవీందర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కరీంనగర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రవీందర్‌రెడ్డి కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ గుర్రం రవీందర్ రెడ్డి పెద్దపల్లి బాలుర కళాశాలకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను కళాశాల సిబ్బంది సన్మానించారు.


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

టీఎంఎఫ్ దూళిమిట్ట కమిటీ ఎన్నిక


ఎన్నికైన టీఎంఎఫ్ కార్యవర్గం

దూళిమిట్ట, జూలై 3: దూళిమిట్ట మండల గణిత ఉపాధ్యాయుల సమావేశం దూళిమిట్ట ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులలో గణిత సామర్థ్యాల పెంపుకు, సాధనకు టీఎంఎఫ్ వినూత్న కార్యక్రమాలకు కృషి చేస్తుందన్నారు. అనంతరం గణిత ఫోరం మండల కమిటీని(టీఎంఎఫ్) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎ.కరుణాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎం.మహేందర్, ప్రధానకార్యదర్శిగా సమత, ట్రెజరర్‌గా వి.మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేర్యాల నోడల్ అధికారి ఆర్.కిష్టయ్య, మద్దూరు నోడల్ అధికారి వరదరాజు, జీహెచ్‌ఎం అయిలయ్య, సబ్జెక్ట్ కో-ఆర్డినేటర్లు రాకేష్ రెడ్డి, లింగాచారి, గణిత ఉపాధ్యాయులు తదితరులున్నారు.

కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం..

చేర్యాల, ఆగస్టు 3: రాష్ట్ర కల్లుగీత కార్మికసంఘం కొమురవెల్లి మండల కమిటీ కార్యవర్గ ఎన్నిక శనివారం కొమురవెల్లిలో జరిగింది. గౌరవఅధ్యక్షులుగా దొడ్ల విష్ణుమూర్తి, తురాయి నవీన్, బూరుగు శ్రీనివాస్, అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజు, మండల ఉపాధ్యక్షులుగా శివలింగ రమేశ్, తాళ్లపల్లి వెంకట్, మండల ప్రధాన కార్యదర్శిగా గన్నబోయిన నర్సింహులు, మండల కోశాధికారిగా జనగామ శ్రీకాంత్, సలహాదారులుగా నర్సింహులు, ఎంబీ. స్వామి, బుడిగె రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బూరుగు భరత్, బత్తిని నర్సింహులు, ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా తాళ్లపల్లి కనకయ్య, పెద్ద అంజయ్య, మండల యూత్ అధ్యక్షుడిగా కొయ్యడ నరేశ్ ఎన్నికయ్యారు.

తల్లి పాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

● తల్లిపాల వారోత్సవంలో అంగన్‌వాడీ టీచర్లు

చిన్నకోడూరు, ఆగస్టు 3: తల్లి పాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏఎన్ఎం సురేఖ అన్నారు. మండలంలోని మాచాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ఆమె అవగాహన కల్పించారు.

● **దూళిమిట్ట:** మండలంలోని సిబ్బితండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ.. తల్లి పాలే పిల్లలకు శేయస్కరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అశోక్, ఏఎన్ఎం జ్యోతిరాణి, ఆశా కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** తల్లిపాల ఆవశ్యకతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత శనివారం బాలింతలు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్దూరు మండలం నర్సాయపల్లిలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లలకు 5 సంవత్సరాలు వచ్చే వరకు ఎత్తు బరువు చూడాలన్నారు. పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశాలు ఏఎన్ఎం నిర్మల పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈవో హేమచంద్ర, ఏఎన్ఎం పద్మ, కుమారి, భాగ్యలక్ష్మి, పరిపూర్ణ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణంలోని బండపల్లి శివారు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు మండలంలోని నాగపురి, బల్యాజీగూడ, షబాశీగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మలిపెద్ది రమ్య, జి.రజిత, రాధ, కనకలక్ష్మి, మంజుల, జ్యోతి, వెంకటలక్ష్మి తదితరులు గర్భిణీ, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత వివరించారు.

● **సిద్దిపేట అర్బన్:** తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని సురభి వైద్య కళాశాలలో ఆధ్వర్యంలో సిద్దిపేటలోని స్థానిక బీజేఆర్ సర్కిల్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాయి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బతాయి, వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ డిపార్టమెంట్ హెచ్‌వోడీ సాయి, కళాశాల సీఈవో ప్రవీణ్‌కుమార్, సీఏవో రామకృష్ణ , ఏవో అమృత్‌పాల్‌సింగ్, పీఆర్వో పరుశురాములు, రాజేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.


చిన్నకోడూరులో మాట్లాడుతున్న ఏఎన్ఎం సురేఖ

● **నంగునూరు:** నంగునూరులోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్ రాగుల రాజమల్లవ్వ మాట్లాడుతూ.. రోగ నిరోధక శక్తిని పెంచేందుకు మొదటగా వచ్చే పాలు ఎంతో శ్రేయస్కారమన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ లావణ్య, ఆయమ్మ పుష్ప, తల్లులు పాల్గొన్నారు.

దారి అలా.. వెళ్లేదెలా?



కొద్దిపాటి వర్షానికి ప్రధాన రోడ్డుపై కుంటలను తలపించేలా నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని దొమ్మాట, సిద్దిపేటకు వెళ్లే రోడ్డు పోచమ్మ గుడి వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పోలీస్టేషన్, తహసీల్దార్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ఈ దారి గుండానే వెళ్లాలి. రోడ్డుపై వర్షం నీరు నిలువకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

\- దౌల్తాబాద్